# నా కథ ఎవ్వరాస్తారు?

మధ్యాహ్న వేళ !

మగవాళ్లంతా ఆవులు మేపేందుకు కొందరు, వ్యవసాయం పనుల మీద కొందరూ యిల్లు వదిలి బయళ్లకు, పొలాలకు వెళ్లిపోయిన వేళ!

వయసుకత్తెలు చంకల్లో పాలకడవలు, తలలపైన వెన్నదుత్తలు పెట్టుకుని మధురానగరికి వెళ్లిన వేళ !

ఆ వేళలో.....

అక్కడ....

ఆ యశోదమ్మ ఇంట్లో.....

వయస్సుడిగిన వాళ్లు, వరసైన వాళ్లు, అత్తలైన వాళ్లు ఆరళ్లు లేని వాళ్లు, అమ్మమ్మలైన వాళ్ళు అంతా పొద్దు పోకకు యశోదమ్మ మందిరానికి విచ్చేశారు. పొద్దు పోకడకు వాళ్ల మాటల్లో వచ్చేవి అన్నీ కన్నయ్య సుద్దులే....

వాళ్ల పలుకులన్నీ చిన్ని కిట్టయ్య గురించే

వాళ్ల కబుర్లన్నీ వెన్నెలయ్య గురించే...

యశోద ఏదో ముచ్చట చెబుతోంది.

మట్టూ చేరిన ముద్దరాండ్రంతా నవ్వుతున్నారు

అప్పుడొచ్చాడు శ్రీకృష్ణుడు...

ఎలా ఉన్నాడు తను

భుజాల మీదికి దిగజారే తెగబారెడు వంకీల జుత్తును ముచ్చట ముడి వేశాడు. ఎగదువ్వి ముడివేయటంతో అది జటలా తయారైంది.

ఒక నూలుపోగు తీసుకుని ఎడం భుజం మీది నుంచి కుడి భుజం క్రిందికి మూడుసార్లు తిప్పి ముడివేశాడు ఆ తెల్లని దారం జందెంలా మిలమిలా మెరుస్తోంది.

ఒక వెదురుబద్ద తీసుకుని దాన్ని విల్లులా వంచాడు. గోగునారని సన్నగా నున్నగా పేని రెండు వైపుల్నీ కలుపుతూ ముడివేశాడు. అది అల్లెత్రాడయ్యింది.

మరో వెదురు పుల్లని బాగా అరగదీసి పదెనెక్కేలా చేశాడు. ఓ చివర ములుకులా సునుపు చేశాడు. అది బాణమైంది.

పీతాంబరాన్ని బిగించి కట్టాడు.

మరో పీతాంబరం ఉత్తరీయంలాగా భుజానికి ఎదుర్రొమ్ము మీది నుంచి లాగి కట్టాడు.

అలా తనంత తానే తయారై వచ్చి నిలిచాడు.

ఆ ముగ్ధమోహన రూపాన్ని చూస్తూ ఉండిపోయారు అందరూ. అలా అలా చూస్తూంటే యశోదమాత్రం కళ్లు ఇంతలుగా చేసి చూస్తోంది.

తనే అడిగాడు. ఊహూఁ ప్రశ్నించాడు.

'అమ్మలారా! మీరంతా ఎవరు?'

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారే తప్ప ఎవరూ జవాబివ్వలేదు. జవాబు తెలియకనా? ఊహూఁ అధాత్తుగా అలా వచ్చి అడిగితే.. అది ఆటో... మాటవరస కాడిన మాటో వారికి తెలియనే లేదు.

'మీరంతా ఋషులు'

ఉలిక్కిపడ్డారు వాళ్లు

"కాకపోతే ఋషి పత్నులు అనుకుంటున్నాను. నిజమేనా! మీరందరూ చాలా మంచి వాళ్లలాగ కన్పిస్తున్నారు. నాకో సాయం చేసి పెడ్తారా?"

ఆ ప్రశ్నకీ ఎవరూ జవాబివ్వలేదు. ఉలికి పాటు నుంచి తేరుకోనూ లేదు.

కానీ - తల్లి తనయుడు ముద్దు చేస్తుంటే మురిసిపోయే తీరులో ముద్దు ముద్దుగా ముచ్చటగా చూస్తున్నారు.

'నే నెవర్ననుకుంటున్నారు?'

ఆ ప్రశ్న ఆశ్చర్యాన్నే కలిగించింది. అయినా అది నల్లనయ్య అనునిత్యం చేసే వేడుకలాటిదే అనుకుంటూ ఆనందిస్తున్నారు.

'మాదే వూరనుకుంటున్నారు?'

క్షణం ఆగి అన్నాడు చిరుదరహాసంతో

'మాది అయోధ్య. మా తండ్రి దశరథ మహారాజు.

నాపేరు - శ్రీరామచంద్రమూర్తి. నా తమ్ముళ్లు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు... నా భార్య సీత.

నేనూ, నా తమ్ముడు లక్ష్మణస్వామి, నా భార్య సీత అడవుల కొచ్చాం.

మా తండ్రి కోరిక మేరకు నగరం వదలి వచ్చాం పదునాలుగేళ్లు వనవాసం చేయాల కాబట్టి పంచవటిలో కుటీరం నిర్మించుకున్నాం.

మేం హాయిగా ఆడుతూ పాడుతూ అడవుల్లో ఉన్నా అయోధ్యలో ఉన్నంత హాయిగా పొద్దులు పుచ్చుతున్నాం

ఒక రోజు -

రావణుడనే రాక్షసుడు నా కులస్త్రీని ఎత్తుకపోయాడు.

వాడిని వెతుక్కుంటూ వస్తున్నాను.

ఇదిగో - ఈ బాణంతో అతడ్ని వధించి నా భార్యను నేను తిరిగి చేపట్టాలి.

అయితే ఆ రాక్షసుడు రావణుడు ఎవరో, ఎక్కడున్నాడో, అతడు నా సీతను ఎత్తుకుని ఏదారిని వెళ్లాడో, ఎక్కడికి వెళ్లాడో నాకయితే తెలియదు...

అమ్మలారా! మీకు తెలుసా?"

అప్పటికి అర్థమైంది వారందరికీ!

ఓహో! చిన్ని కన్న రామకథ అభినయిస్తున్నాడా అనుకున్నారు. దానితో వాళ్ళూ కొద్దిసేపు తామూ నటించాలనుకున్నారు. ఇరువురూ బాగా నటిస్తేనే కదా కథ రక్తికట్టేది అందుకే కథని రసవంతం చేసి రక్తి కట్టించాలనుకున్నారు.

'అయ్యా! రామయ్యా! తమరా బాబూ! యుగం మారడంతో తమరిని గుర్తించలేక పోయాం స్వామీ! తమరికి సీతమ్మ జాడ కావాలా? రావణుడెక్కడున్నాడో ఏ దేశం వాడో తెలియచెప్పాలా? మరయితే మీ తమ్ముడు లక్ష్మన్న ఏడీ? ఎక్కడ?"

పరమగంభీరంగా జవాబిచ్చాడు యిలా.

'ఇప్పుడు నాకు తమ్ముడు లేడు.'

అన్నగారున్నారు...

అప్పటాయనే ఇప్పుడన్న అయి కూర్చున్నాడు.

అప్పుడేమో కానీ ఇప్పుడాయన పేరే రాముడు. నా పేరు కృష్ణమూర్తి... అదంతా ఎందుకు మీకు?

మీకు సీత కన్పిస్తే చెప్పండి!"

'అయితే రామచంద్రా! మాట! మరప్పుడు నీకు భార్య ఒక్కతే కదా! మరిప్పుడు ఈ గొల్లపల్లె రేపల్లెలోని ఆడవాళ్లంతా తాము నీ భార్యలమనే అనుకుంటున్నారు కదా! నీతో తిరుగుతారు. ఆడతారు. పాడతారు. నీ పిల్లంగ్రోవి పిలుపు వెంట పరుగు పరుగున వస్తారు కదా! వేల మంది ఉన్నారు కా! ఒకర్ని ఎవడో ఆ రాక్షసుడు ఎత్తుకపోతే నీకేం కొదవ? నీకేం బాధ?' అని అడిగారు వాళ్లు.

ఇంతసేపూ ఇదంతా వినోదంగా వింతగా చూస్తూ ఆనందిస్తోంది యశోద... వాళ్లలా అడగ్గానే భయపడిపోయింది.

ఒక్క క్షణంలో ఉరుకున వెళ్లి అతన్ని ఎత్తుకుంది. 'బాబయ్యా! ఇప్పుడే నీ కిన్ని బుద్ధులున్నాయి! ఊరంతా రట్టు!...... రవ్వ... పెరిగి పెద్దయితే ఎన్ని నాటకాలు ఆడతావో. ఎన్ని లీలలు ప్రదర్శిస్తావో.. ఏ రాయబారాలు నడిపి... ఏ యుద్ధాలు చేస్తావో చేయిస్తావో.... అని భయం భయంగా ఉందయ్యా బాబా!' అని ముద్దులాడ్తోంది. ఆమె కళ్లల్లో నీళ్లు. గుండెలో గుబుళ్లు.

ఆమె అలా ముద్దు చేస్తుంటే -

ఆమె చంక దిగాలని మారాం చేస్తూ 'వదులు.... వదులు... నన్ను దించు... నాకు పని ఉంది' అన్నాడు.

'ఏం పని బాబూ?'

'వెదకాలి'

'ఎవరిని?'

'ఎవరినయినా ఋషిని'

'ఎందుకయ్యా కన్నతండ్రీ?'

'ఆ రాముడి కథ వాల్మీకి రాశాడు.

ఆ సీత మగడి కథ రాశాడాయన.

మరి నాకథ - నా కథ రాసేవాడిని నేనే వెతుక్కోవద్దా?'

ఆ మాట విని అంది యశోద...

'నాయనా! ఆ రాముడు గుణవంతుడు. అందుకని వాల్మీకి రామాయణం పాడాడు. నువ్వు నిర్గుణుడివి. నిన్ను గురించి రాసేదెవరు?

అయినా ఆ రాముడు తండ్రిమాట పాటించి అడవికి వెళ్లాడు... నువ్వు.. తల్లి మాట విని చంకలో అయినా కుదురుగా కూర్చోవు... నీ గురించి రాసేదెవరయ్యా?'

అక్కడ ..... ఇక నవ్వులే నవ్వులు....

చమత్కారాలే చమత్కారాలు...

యశోదమ్మ చంకలో బందీ అయిన కన్నయ్య....

'శ్రీ యుత విశ్వనాథ సత్యనారాయణ గారి శ్రీకృష్ణ సంగీతం ప్రేరణతో)

* * *